క్లుప్తంగా

నూతన కమిటీ ఎన్నిక


శంకర్‌ప్రసాద్

సూర్యాపేట రూరల్ : పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వల్లెం శంకర్‌ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా పటేల్ శ్రీమాన్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షులుగా ఖదీర్, కార్యదర్శిగా డి.శంకర్‌నాయక్, మహిళా ఉపాధ్యక్షురాలుగా రెబ్బ శ్రీలత, మహిళా కార్యదర్శిగా వి.రేణుక ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వల్లెం శంకర్ ప్రసాద్ మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడుతూ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జ్యోతుల చంద్రశేఖర్, చింతరెడ్డి రామలింగారెడ్డి, జితేందర్‌రెడ్డి, దొంగర మహేష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

పేదలకు సేవ చేయడమే లక్ష్యం



ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు రేఖ

అర్వపల్లి : పేద ప్రజలకు సేవ చేయడమే రేఖ చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, జాతీయ టెన్నిస్ క్రీడాకారిణి డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. అడివెంల ప్రాథమిక పాఠశాలలో శనివారం రేఖ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాలకు క్రీడా పరికరాలు, జాతీయ నాయకుల చిత్రపటాలను అందజేశారు. అలాగే శిథిలమైన పాఠశాల భవనాన్ని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరమ్మతు చేయించి రంగులు వేయించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మడ్డి పద్మ, హెచ్‌ఎం లింగంపల్లి యాదమ్మ, ఉపాధ్యాయురాలు కరుణ, అంగన్‌వాడీ టీచర్లు శతకోటి సరోజ, కళమ్మ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ఆత్మకూర్ (ఎస్) : వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్‌ఐ సైదులు అన్నారు. శనివారం నెమ్మికల్‌లో రహదారిపై వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో చెక్ చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని కోర్టులో హాజరు పరిచారు. పట్టుబడిన 18మందికి పీడీఎం కోర్టు మేజిస్ట్రేట్ సురేష్ ఒక్కొక్కరికి రూ.2000 చొప్పున మొత్తం రూ.36,000 జరిమానా విధించారు. మరో సారి మద్యం సేవించి వాహనాలు నడపరాదని కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : కుడకుడ గ్రామంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు మండల విద్యుత్ అధికారి మల్లయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని వినాయక నగర్, స్నేహనగర్, ఎస్సీ కాలనీ, పీఎస్‌ఆర్ టౌన్‌షిప్‌లో మరమ్మతుల నేపథ్యంలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత


ధన్‌సింగ్‌నాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

అర్వపల్లి : మండల పరిధిలోని సూర్యనాయక్ తండాలో ఇటీవల మృతిచెందిన బానావత్ ధన్‌సింగ్‌నాయక్, లునావత్ సాలమ్మ కుటుంబాలను శనివారం డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి పరామర్శించారు. కుటుంబానికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. అలాగే కొమ్మాలలో మర్యాద వీరయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా అతడిని పరామర్శించారు. కార్యక్రమంలో కుంటిగొర్ల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఎల్.స్వాతిరవీందర్ నాయక్, రాజేష్‌నాయక్, కిషన్‌నాయక్, వెంకన్న, కృష్ణ, పవన్, బద్రు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

- అపరిశుభ్ర పరిసరాలతో వ్యాధులు వ్యాపించే అవకాశం
- సూర్యాపేటలో అధ్వానంగా రోడ్లు, మురుగుకాలువలు
- పట్టింపులేని పాలకవర్గం



27వ వార్డులో ఇటీవల వర్షానికి బురదమయంగా మారిన రహదారులు

సూర్యాపేట : పట్టణంలో పారిశుద్ధ్య లోపం ప్రజలకు శాపంగా మారింది. పలువార్డుల్లో అపరిశుభ్ర పరిసరాలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రోడ్లపై వర్షపు నీరు, మురుగునీరు నిల్వ ఉండడం, పరిసరాలు అధ్వానంగా మారాయి. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని కొందరి ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. వర్షపు నీటితోపాటు మురుగు కూడా ఇళ్లలోకి వస్తోందని ప్రజలు తెలుపుతున్నారు. పాలకవర్గం మాత్రం పారిశుద్ధ్య పనులను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి. సిబ్బంది డ్రెయినేజీలను శుభ్రం చేయించడం, బ్లీచింగ్ పౌడర్ చల్లించడం మరిచారు. ఫలితంగా పట్టణంలో దోమలు విలయతాండవం చేస్తున్నాయి. దోమల నివారణకు చర్యలు చేపట్టాల్సిన అధికారులు, పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు తెలుపుతున్నారు.

43 డెంగీ కేసులు..

సూర్యాపేట పట్టణంలో పారిశుద్ధ్యాన్ని పట్టించుకునే నాథుడే కరవయ్యాడు. ఫలితంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. ఒక్క సూర్యాపేట పట్టణంలోనే 43కు పైగా డెంగీ కేసులు నమోదైనట్లు వైద్యాధికారుల లెక్కలు చెబుతున్నాయి. పట్టణంలో డెంగీ వేగంగా వ్యాప్తి చెందుతుండడంపై పట్టణప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డెంగీ కారణంగా నలుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించి వైద్యం అందించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎవరూ పట్టించుకోవట్లేదు

మురుగు కాలువల్లో, ఇళ్ల ఎదుట మురుగు నీరు పేరుకుపోతున్నా ఇప్పటి వరకు ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో దోమలు ఎక్కువగా పెరుగుతున్నాయి. ప్రజలు డెంగీ బారిన పడుతున్నారు. మురుగు ప్రాంతాల్లో కనీసం బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలి. **- విజయమ్మ, 9వ వార్డు**

రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలి

జ్వరాలతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం. రోడ్లు, డ్రెయినేజీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది మురుగుకాలువల్లో పూడిక తీత పనులు చేపట్టాలి. ఖాళీ ప్రదేశాల్లో పెరుగుతున్న పిచ్చి మొక్కలను తొలగించాలి. దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించాలి. **- రాజేష్, 27వ వార్డు**

పుల్లయ్య జీవితం స్ఫూర్తిదాయకం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

నూతనకల్ : సీపీఎం సీనియర్ నాయకుడు బిక్కి పుల్లయ్య జీవితం స్ఫూర్తిదాయకమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. శనివారం చిల్పకుంట్లలో నిర్వహించిన పుల్లయ్య సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసిన నిజమైన కమ్యూనిస్టు యోధుడు పుల్లయ్య అని ఆయన తెలిపారు. చదువు రానప్పటికీ ఎంతో జ్ఞానాన్ని పొంది సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన పుల్లయ్య జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కళాకారులు ఆలపించిన విప్లవ గేయాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కందాల శంకర్‌రెడ్డి, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, కోట గోపి, పులుసు సత్యం, ములకలపల్లి రాములు, వేల్పుల వెంకన్న, బుర్రి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న అధికారులకు సన్మానం


ఎంపీఓను సన్మానిస్తున్న అధికారులు

మద్దిరాల : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహించిన ఎంపీఓ రాజేష్, గోరెంట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి మంగ, రెడ్డిగూడెం గ్రామ పంచాయతీ కార్యదర్శి నాతి రమేష్ బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లారు. ఈ సందర్భంగా శనివారం వారిని మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి ఘనంగా సన్మానించారు.

కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న సీఐ సురేందర్‌రెడ్డి

సూర్యాపేట రూరల్ : కాలనీవాసులు అప్రమత్తంగా ఉండాలని సూర్యాపేట రూరల్ సీఐ సురేందర్ రెడ్డి అన్నారు. శనివారం రాత్రి సూర్యాపేట పట్టణంలోని సుగుణ స్మార్ట్ సిటీ కాలనీవాసుల సమావేశానికి హాజరై మాట్లాడారు. కాలనీవాసులు కొత్త వ్యక్తులు సంచరించినప్పుడు ప్రశ్నించాలని తెలిపారు. ఇంటి నుంచి బయటికి వెళ్లినప్పుడు పక్క ఇంటి వారికి చెప్పి వెళ్లాలని, యాత్రలకు, గ్రామాలకు వెళ్తే తప్పకుండా పోలీసులకు సమాచారం అందించి వెళ్లాలన్నారు. దొంగలు ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నారని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కాలనీవాసులు సమన్వయంతో కలిసి ఉన్నప్పుడే దొంగలను పట్టుకోవచ్చని తెలిపారు. పోలీస్ శాఖ ప్రజల పక్షాన ఎల్లప్పుడూ ఉంటుందని, భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో చివ్వెంల ఎస్‌ఐ వెంకట్ రెడ్డి, సుగుణ స్మార్ట్ సిటీ కమిటీ అధ్యక్షుడు దామిడి రమేష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, భిక్షం, సునీత, శివ పార్వతి, మాధవి, చైతన్య, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల సవరణకు అవకాశం

ఆత్మకూర్ (ఎస్): ప్రజాపాలనలో మొదట విద్యుత్, గ్యాస్ సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్న కొందరు లబ్ధిదారులకు సైట్‌లో నాట్ అప్లయిడ్ అని ఉన్న వాటికి సరిచేయుటకు అవకాశం ఉందని ఎంపీడీఓ ఎండీ హసీం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నాట్ అప్లయిడ్ అని ఉన్నవారికి సబ్సిడీ రావడం లేదు. కాబట్టి ఆ ఆప్షన్‌ను సరిచేసుకునేందుకు అవకాశం ఉందని తెలిపారు. దరఖాస్తుదారుడు విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ ఫోన్‌తో ఎంపీడీఓ కార్యాలయానికి వచ్చి సబ్సిడీ దరఖాస్తును సరి చేసుకోవాలని సూచించారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోగా దరఖాస్తులో తప్పులు ఉన్నవారు మాత్రమే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

తండాల్లో వైభవంగా తీజ్ వేడుకలు


తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజనులు

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండల పరిధిలోని దాస్ తండాలో శనివారం సాయంత్రం గిరిజనులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పర్యాటక అభివృద్ధి చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి హాజరై పూజలు నిర్వహించారు. వేడుకల్లో నూనవత్ సేటు, బాలు, దిక్కు సింగ్, దాస్య, సోమ్లా నాయక్, మెగావత్ బాలు, పాండు, చాంప్ల, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.


వేడుకల్లో పాల్గొన్న పటేల్ రమేష్‌రెడ్డి

తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

తిరుమలగిరి : మన సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేవి పండుగలు అని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అన్నారు. శనివారం రాత్రి తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని నెల్లిబండ తండాలో తీజ్ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గిరిజనులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గిరిజన యువతులతో కలిసి ఎమ్మెల్యే నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనసూయ రాములు, కౌన్సిలర్ భాస్కర్, విరేశ్, జమ్మీలాల్, అశోక్ రెడ్డి, జనార్దన్, హీరు నాయక్, లక్ష్మయ్య, సుధాకర్ పాల్గొన్నారు.


తిరుమలగిరి : నెల్లిబండ తండాలో తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మందుల సామేల్

రుణమాఫీతో రైతులకు న్యాయం

అర్వపల్లి: రుణమాఫీ పథకం ద్వారా రైతులకు పూర్తి న్యాయం జరిగిందని డీసీసీ ఉపాధ్యక్షుడు దరూరి యోగానందచారి అన్నారు. కొమ్మాల గ్రామంలో మల్యాల గుట్టయ్య అనే రైతు వ్యవసాయ బావి వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను శనివారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో కుంటిగొర్ల శ్రీనివాస్, బాషపోలు శ్రీనివాస్, ఉపేందర్, వి.శ్రీను, గోళ్ల వెంకటేశ్వర్లు, గంగయ్య, అవిలేను, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నాగారం : హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఈ నెల 21న జరిగే తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు అన్నారు. శనివారం మండల కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాదిగ జర్నలిస్టుల ఫోరం నాయకులు లక్ష్మణ్, జానీప్రసాద్, నవీన్, తిరుపతి, లింగయ్య, తదితరులు పాల్గొన్నారు.

శ్రీసంతోషి మాత జన్మదిన వేడుకలు


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సూర్యాపేట : విఘ్నేశ్వరుని మానస పుత్రిక శ్రీసంతోషి మాత జన్మదిన వేడుకలను శనివారం పట్టణంలోని శ్రీసంతోషిమాత దేవాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీసంతోషిమాత, శ్రీ సత్య సాంబశివుడు, శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ ఆంజనేయ స్వామి, శ్రీ సంతాన నాగ దేవత, మానస దేవిలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై గణపతి పూజ పుణ్యాహవాచనం, దీక్ష కంకణ ధారణ, అఖండ దీపారాధన పూజలు జరిపారు. రుద్రహోమం, లలిత హోమం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ అర్చకులు భట్టరము వంశీకృష్ణశర్మ, శ్రీ సంతోషి మాత దేవాలయ అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేశం గుప్తా, మురళీధర్, రామమూర్తి, బాలచంద్రుడు, జగదీశ్వరి, పురుషోత్తం పాల్గొన్నారు.

చట్టాలను కఠినంగా అమలు చేయాలి


ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

సూర్యాపేట : దేశంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను, దాడులను అరికట్టాలని, మహిళల రక్షణకు చట్టాలను కఠినంగా అమలు చేయాలని కోరుతూ శనివారం పట్టణంలో 45వ వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది మహిళలు నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లి రామలింగేశ్వర టాకీసు వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం వార్డు కౌన్సిలర్ గండూరి పావని కృపాకర్ మాట్లాడారు. దేశంలో మహిళలపై అత్యాచారాలు పెరిగిపోతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా ప్రెసిడెంట్ ఇరిగి కోటేశ్వరి, డాక్టర్ విజయలక్ష్మి, మద్ది హైమావతి, బిక్కుమళ్ల మంజుల, పిశిక సువర్ణ, స్వప్న, మంజుల, కవిత, సావిత్రి, రుచిత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి


తుంగతుర్తిలోని సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న వైద్యసిబ్బంది

తుంగతుర్తి : కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై అత్యాచారం చేసి దారుణంగా హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం డాక్టర్లు, వైద్యసిబ్బంది డిమాండ్ చేశారు. శనివారం వారు సామాజిక ఆరోగ్య కేంద్రం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి, కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. దేశవ్యాప్తంగా వైద్యుల రక్షణ కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు రక్షణ కల్పించాలి

అర్వపల్లి : కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన ఘటన నేపథ్యంలో వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని జాతీయ హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్, యాంటీ క్రైమ్ బ్యూరో ఆఫ్ ఇండియా సంస్థ జిల్లా ఉపాధ్యక్షుడు రింగు సాయితేజ కోరారు. శనివారం విలేకరులతో మాట్లాడారు. మనుషుల ప్రాణాలను కాపాడుతున్న వైద్యులపై ఇలాంటి దాడులు చేయడం తగదన్నారు. మహిళలకు రోజురోజుకూ భద్రత లేకుండా పోతుందని తెలిపారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు


తుంగతుర్తిలోని డీఆర్‌ఆర్‌ఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు


తుంగతుర్తి : వెంపటి ప్రాథమిక పాఠశాలలో..

తుంగతుర్తి : మండల కేంద్రంలోని డీఆర్‌ఆర్‌ఎం ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో, మండల పరిధిలోని వెంపటి ప్రాథమిక పాఠశాలలో శనివారం రాఖీ పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్రామనర్సమ్మ, ఉపాధ్యాయులు శ్రీకాంత్, మమత, శ్రీనివాస్, ఎల్లయ్య, రవీందర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో శనివారం రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరికొకరు రాఖీలు కట్టుకొని సోదరభావం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్, విజయలక్ష్మి, యాదగిరి పాల్గొన్నారు.


నూతనకల్‌లోని నాగార్జున ఉన్నత పాఠశాలలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థులు

ఏఐఎస్‌ఎఫ్ ఆవిర్భావ దినోత్సవం


ఏఐఎస్‌ఎఫ్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

భానుపురి : పట్టణంలోని సీపీఐ కార్యాలయం ఆవరణలో అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్‌ఎఫ్) 89వ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం సంఘం మాజీ నాయకుడు దంతాల రాంబాబు మాట్లాడారు. దేశానికి సంపూర్ణ స్వతంత్ర్యం లక్ష్యంగా విద్యార్థులను చైతన్యం చేసిన విద్యార్థి సంఘం ఏఐఎస్‌ఎఫ్ అని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యా కాషాయీకరణకు వ్యతిరేకంగా, కామన్ విద్యా విధానం కోసం పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్, నాయకులు బూర వెంకటేశ్వర్లు, జిల్లా మహిళా సంఘం కోశాధికారి దంతాల పద్మా రేఖ, పోతుల పవన్, సాకేత్ రెడ్డి, మహేందర్, రామ్ చరణ్, రాజకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

దాడి చేయడం అమానుషం

తుంగతుర్తి : సిద్దిపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ వర్గాలు దాడికి పాల్పడటం అమానుషమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలను రక్షించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని కోరారు. ఆయనతోపాటు గుండగాని రాములుగౌడ్, గోపగాని శ్రీనివాస్‌లు ఉన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి


మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

తిరుమలగిరి : ప్రతి విద్యార్థి మొక్కలు నాటడంతోపాటు వాటిని సంరక్షించాలని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ చాగంటి అనసూయరాములు అన్నారు. శనివారం తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీజీఆర్ ఆధ్వర్యంలో ఔషధ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామర శ్రీనివాసులు, కౌన్సిల్ ఫర్ గ్రీన్ రివల్యూషన్ జిల్లా ఇన్‌చార్జ్ మామిడి శంకర్, ఉపాధ్యాయులు వెంకన్న, జానయ్య, ఎల్లయ్య, బోసుబాబు, అశోక్, కంఠం గౌడ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభివృద్ధికి ప్రతి కార్యకర్త కృషిచేయాలి

చివ్వెంల : కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శనివారం మండల పరిధిలోని మోదిన్‌పురం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు, కార్యకర్తలు సూర్యాపేట పట్టణంలోని వైట్ హౌజ్‌లో ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వీరప్ప, వెంకన్న, జాను, సుధాకర్, రామలింగం, రాములు, శ్రీను, గిరి, అంజయ్య, వేణు, భిక్షం, సైదులు, జయమ్మ, కనకమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ క్లబ్ సెక్రటరీ కొప్పుల వేణారెడ్డి, ధరావతు వీరన్న నాయక్, సగరపు ప్రసాద్, చత్రు నాయక్ తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

సంక్షిప్త సమాచారం

చివ్వెంల మండల వ్యవసాయ అధికారిగా వెంకటేశ్వర్లు

చివ్వెంల : మండల వ్యవసాయ అధికారిగా డి.వెంకటేశ్వర్లు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన బదిలీపై తిరుమలగిరి మండలం నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎ.ఆశాకుమారి బదిలీపై సూర్యాపేట జిల్లా కార్యాలయానికి వెళ్లారు. అదే విధంగా ఏఈఓలు పవన్, సాయికుమార్ బదిలీపై వేరే మండలాలకు వెళ్లగా కుడకుడ, దురాజ్‌పల్లి క్లస్టర్ నూతన ఏఈఓలుగా బి.శైలజ, ఎం.సహస్ బాధ్యతలు చేపట్టారు.

పెన్‌పహాడ్ ఏఓగా అనిల్‌కుమార్

పెన్‌పహాడ్ : మండల వ్యవసాయ అధికారిగా బానోతు అనిల్‌కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మునగాల మండలం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చాడు. ఇక్కడ విధులు నిర్వహించిన మండల వ్యవసాయ అధికారి బి. కృష్ణసందీప్ సూర్యాపేట రూరల్ మండలానికి బదిలీపై వెళ్లారు. అదే విధంగా మండల పరిధిలోని అనాజిపురం ఏఈఓగా మురళీ, అన్నారం ఏఈఓగా శ్రావణి, చీదెళ్ల ఏఈఓగా రాకేష్‌లు బదిలీపై వచ్చారు.

పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడిగా డేవిడ్‌రాజ్

అర్వపల్లి : పాస్టర్స్ ఫెలోషిప్ మండల అధ్యక్షుడిగా కోమటిపల్లి గ్రామ పరిశుద్ధ ప్రార్థన మందిరం పాస్టర్ తీగల డేవిడ్‌రాజ్ రెండవసారి ఎన్నికయ్యారు. శనివారం గ్రామంలోని చర్చిలో జరిగిన ఎన్నికలో రెండవసారి డేవిడ్‌రాజ్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు బాబూరావు, ఉపాధ్యక్షుడు సుధీర్, కార్యదర్శి రమేష్, పరంజ్యోతి, పాస్టర్లు పాల్గొన్నారు.

రుణమాఫీ కోసం భారీగా దరఖాస్తులు

అర్వపల్లి : రుణమాఫీ కాని రైతుల నుంచి శనివారం రామన్నగూడెం, తిమ్మాపురం రైతు వేదికలకు భారీగా దరఖాస్తులు వచ్చాయి. రైతుల నుంచి వ్యవసాయ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. వీటన్నింటిని ప్రభుత్వానికి పంపనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ మల్లారెడ్డి, ఏఈఓలు శోభారాణి, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను తప్పకుండా స్కూల్‌కు పంపాలి

అర్వపల్లి : పిల్లలను తల్లిదండ్రులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని కోడూరు ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం ఇట్టమల్ల అశోక్ అన్నారు. పాఠశాలలో శని వారం తల్లిదండ్రుల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పిల్లలకు నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు సిద్ది జయసుధ, అంగన్‌వాడీ టీచర్ సునీత, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.